క్లుప్తంగా

వోల్వో ఎలక్ట్రికల్ కారు విడుదల



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని కార్ల తయారీ సంస్థ వోల్వో కంపెనీకు చెందిన సి 40 ఎలక్ట్రిక్ కారు శనివారం రాత్రి నగర మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా షోరూమ్ జీఎం సురేష్ కుమార్ మాట్లాడుతూ అత్యాధునిక సౌకర్యాలతో సరికొత్త ఫ్యూచర్లతో వినియోగదారులకు తగ్గట్టుగా ఈ కారును రూపొందించినట్లు తెలిపారు. ఈ ఎలక్ట్రిక్ కారును ఒక్క సారి చార్జ్ చేస్తే 530 కిలో మీటర్ల మైలేజ్ ఇస్తుందని తెలిపారు. తక్కువ సమయంలో ఈ కారుకు దేశ వ్యాప్తంగా మంచి పేరు వచ్చిందన్నారు. అతి తక్కువ సమయంలోనే కారును చార్జ్ చేసుకోవచ్చని తెలిపారు. ఈఈసీ 40 ఈవీ కారు ధర సుమారు రూ.61లక్షల వరకు ఉంటుందని తెలిపారు. పర్యవరణాన్ని పర్యరక్షిస్తూ ఈ కారును వినియోగించడానికి ఇష్టపడే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

గర్భిణుల సేవలపై ప్రత్యేక దృష్టి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు):కుటుంబ డాక్టర్ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతల సేవలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, వారికి అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. విజయవాడ రూరల్ మండలంలోని గూడవల్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నిర్వహిస్తున్న కుటుంబ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన వారికి అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులకు ఇచ్చేందుకు మందులు అందుబాటులో ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించారు. అనంతరం ఆ ప్రాంతంలో నిర్వహిస్తున్న డ్రైడే ఫ్రైడే, వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం, అంగన్‌వాడీ సేవలు, ఆశ యాప్ లాగిన్ పర్యవేక్షణ వంటి అంశాలను తనిఖీ చేశారు. నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో రూరల్ వైద్యాధికారులకు జగనన్న ఆరోగ్య సురక్ష శిక్షణ నిర్వహించారు. డీపీఎంఓ డాక్టర్ నవీన్, కుటుంబ డాక్టర్ నోడల్ అధికారి డాక్టర్ మోతీ బాబు, డాక్టర్ వాసంతి పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు ఓటమి భయం

గుణదల (విజయవాడ తూర్పు): ఎన్నికలు దగ్గర పడుతున్న ప్రస్తుత తరుణంలో టీడీపీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందని వైఎస్సార్ సీపీ నగర ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ అన్నారు. గుణదలలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజకీయ నీఛుడిగా పేరు తెచ్చుకున్న టీడీపీ నాయకుడు పట్టాభికి మతి భ్రమించిందని ఎద్దేవా చేశారు. నిత్యం ప్రజల్లో ఉంటూ సేవ చేస్తున్న వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్చార్జ్ దేవినేని అవినాష్‌ను విమర్శించడం హేయమన్నారు. కాల్‌మనీ, సెక్స్ రాకెట్ కేసుల్లో కీలక నిందితుడిగా ఉన్న పట్టాభి తమ నాయకుడు అవినాష్ ను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. వచ్చే ఎన్నికల్లో అవినాష్ గెలవటం కల అంటూ పట్టాభి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. వయసులో చిన్నవాడైనా ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నిత్యం ప్రజల్లో ఉంటున్న అవినాష్ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలవటం ఖాయమని స్పష్టం చేశారు. కో ఆప్షన్ సభ్యుడు ముసునూరి సుబ్బారావు మాట్లాడుతూ టీడీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. సమావేశంలో 5వ డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్, మాజీ డెప్యూటీ మేయర్ చల్లారావు పాల్గొన్నారు.

దోమల లార్వా నిర్మూలనకు చర్యలు

పటమట:నగర పరిశుభ్రతలో భాగంగా పరిసరాల శుభ్రతతో పాటు నగరంలోని పాత బావులను మురుగు కాల్వల నిర్వహణ సక్రమంగా జరిగేందుకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని బయాలజిస్ట్ సూర్య నాయక్ అన్నారు. వన్ టౌన్, సత్యనారాయణపురం ఏరియాలో శనివారం ఆయన పర్యటించారు. పాత బావులను గుర్తించి వాటిలో దోమల లార్వా వృద్ధి చెందకుండా మందులు కొట్టి బావులను పైన వస్త్రాలతో కప్పాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఫాగింగ్ నిర్వహిస్తూ, నీరు నిల్వున్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్నామని తెలిపారు.

తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు

- తప్పుచేస్తే చట్టం పరిధిలో ఎవరైనా ఒకటే
- 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేస్తే.. అవినీతికి పాల్పడినా అరెస్ట్ చేయరా?
- అరెస్ట్‌ను పట్టించుకోని ప్రజలు, సామాన్య కార్యకర్తలు
- అన్ని ఆధారాలతోనే అరెస్ట్ చేశారని నిపుణుల వెల్లడి
- దీనిలో రాజకీయ కక్ష సాధింపు ఏముందీ అంటున్న సామాన్యులు
- పలువురి అభిప్రాయాలతో ప్రత్యేక కథనం

మధురానగర్(విజయవాడసెంట్రల్):విద్యార్థులకు నైపుణ్యాలు పెంపొందించే కార్యక్రమంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్ట్ చేయడం సబబేనని ప్రజలు భావిస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అవినీతికి పాల్పడితే అరెస్ట్ చేయరా అని సామాన్యులు సైతం ప్రశ్నిస్తున్నారు. దీంతో చంద్రబాబును నంద్యాలలో ఉదయం అరెస్ట్ చేసినా, సాయంత్రం వరకూ విజయవాడలో ప్రశాంత వాతావరణం నెలకొంది. ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. వ్యాపారాలు ఎప్పటిలాగానే కొనసాగాయి. షోరూమ్‌లు వినియోగదారులతో కిటకిటలాడాయి. బస్సులు యథాతథంగా తిరిగాయి. స్కిల్ డెవలప్‌మెంట్‌లో అవినీతి జరిగిందని సీఐడీ అధికారులు ఆధారాలతో సహా చెబుతుంటే, అరెస్ట్ చేయరా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అవినీతి కేసులో అరెస్ట్ చేస్తే రాజకీయ కక్ష సాధింపు అనడం సరైంది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటి వరకూ అనేక కేసుల్లో స్టేలపై తప్పుకున్న చంద్రబాబు, పాపం పండిందని, అందుకే అరెస్ట్ అయ్యాడని ప్రజలు అంటున్నారు.

ప్రజలు పట్టించుకోవడం లేదు



చట్ట ప్రకారం తీసుకునే చర్యలను అడ్డుకోవటం తగదు. ఏ నేరం చేయక పోతే చంద్రబాబు తన నిజాయితీను రుజువు చేసుకోవాలి. చంద్రబాబు నిజాయతీ ఏంటో ప్రజలకు అర్థం అయింది. ఎన్నికల సమయంలో తన అరెస్టును రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూస్తున్నారు. చంద్రబాబు అరెస్టు గురించి టీడీపీ నేతలతో పాటు ప్రజలు కూడా పట్టించుకోవటం లేదు

–పెనుమత్స సత్యం, వైఎస్సార్ సీపీ నాయకులు

సొంత వాళ్లే నమ్మడం లేదు



చంద్రబాబు ఏ తప్పూ చేయకపోతే విచారణ ఎదుర్కొని నిర్దోషిగా బయటకు రావచ్చు. కానీ ఆయన ఎప్పుడూ కూడా కేసులను ఎదుర్కొనకుండా స్టేల మీదే ఎందుకు కొనసాగుతున్నారు. ఆయన అధికారంలో ఉన్నప్పటి నుంచి కూడా విచారణలకు సహకరించకుండా కేసులను స్టేలమీదే నెట్టుకొస్తున్నారు. చంద్రబాబును ప్రజలతో పాటు సొంత పార్టీ వాళ్లు కూడా నమ్మడం లేదు.

–బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి, కార్పొరేటర్

రాజకీయం చేయడం తగదు



చంద్రబాబు అరెస్టును రాజకీయం చేయడం టీడీపీకి తగదు. కనీసం డివిజన్‌లో టీడీపీ నేతలు కూడా చంద్రబాబు అరెస్టుపై స్పందించకపోవటం గమనార్హం. చంద్రబాబును ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలే నమ్మే పరిస్థితి కనబడటం లేదు.

–కొంగితల లక్ష్మీపతి, కార్పొరేటర్

అడ్డంగా బుక్కయ్యాడు



నేరం చేసిన వారికి శిక్ష తప్పదు. ఎవరికైనా న్యాయం ఒక్కటే. నేరం చేసిన తరువాత అడ్డంగా బుక్కయిన తరువాత కూడా వాదించటం చంద్రబాబుకే చెల్లింది. తప్పు చేసిన తరువాత కూడా రాజకీయంగా లబ్ధి పొందాలని చూడటం చంద్రబాబు నైజం.

–గుండే సుందర్‌పాల్, వైఎస్సార్ సీపీ నాయకులు

చంద్రబాబు అరెస్ట్ కరెక్టే



చంద్రబాబు అరెస్ట్ సక్రమమే. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లో జరిగిన కోట్లాది రూపాయల కుంభకోణంలో చంద్రబాబు ప్రమేయం ఉండబట్టే సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. చట్టం ముందు అందరూ ఒకటేనని తప్పు చేసిన ప్రతి ఒక్కరూ శిక్ష అనుభవించాల్సిందే.

ఎర్రంశెట్టి అంజిబాబు, ప్రజాకాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు

చట్టానికి చంద్రబాబు అతీతుడు కాదు



చట్టం ముందు ఎవరైనా ఒకటే. చట్టానికి చంద్రబాబు అతీతుడు కాదు. స్కిల్ డెవలప్‌మెంటు స్కామ్‌లో చంద్రబాబు అరెస్టు సక్రమమే. చంద్రబాబు అక్రమాలకు పాల్పడటం కొత్తేమీ కాదు. అనేక స్కామ్‌ల్లో ఆయన ఉన్నప్పటికీ కోర్టుల నుంచి స్టేలు తెచ్చుకొని, వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారు. ఆయన మళ్లీ అధికారంలోకి రాకూడదు.

మేడా రమేష్, ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి

అరెస్టు సక్రమమే



స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లో జరిగిన కోట్లాది రూపాయల స్కామ్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్ట్ సక్రమమైందే. గతంలో అనేక కేసుల్లో ప్రమేయం వున్న చంద్రబాబు స్టేలు తెచ్చుకొని తప్పించుకున్నాడు. ప్రస్తుతం స్కిల్ స్కామ్‌లో అరెస్ట్ సబబే. స్కామ్‌ల్లో ప్రమేయం వున్న ఎలాంటి పెద్ద వ్యక్తులనైనా అరెస్ట్ చేయాల్సిందే.

నాగుల్‌మీరా, ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు

బాబు జమానా.. అవినీతి ఖజానా

సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చంద్రబాబు పాలన అవినీతికి కేరాఫ్ అని స్కిల్ డెవలప్‌మెంట్ పేరిట రూ.371 కోట్లు ప్రభుత్వ ధనాన్ని షెల్ కంపెనీల పేరిట దోచుకున్నారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు నివాసంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేంలో ఆయన మాట్లాడారు. బాబు జమానా.. అవినీతి ఖజానా అని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఇంతగా దిగజారిపోయి ఇన్ని కోట్ల రూపాయలను షెల్ కంపెనీల పేరిట దోచుకోలేదన్నారు. బాబొస్తే జాబొస్తుందంటూ నినాదం పేరిట అవినీతి, అమరావతి రాజధాని పేరిట స్కాం చేయటం చంద్రబాబు కే చెల్లిందన్నారు. అమరావతిలో కాంట్రాక్టులు, మౌలిక సదుపాయాల కాంట్రాక్టుదారుల నుంచి సైతం ముడుపులు అందుకున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. చంద్రబాబు పాలన ఆద్యంతం అందినకాడికి దండుకోవటమే ధ్యేయంగా సాగిందన్నారు. రాజకీయ కోణం, రాజకీయ కక్షలు కాకుండా రెండు సంవత్సరాల పాటు పూర్తి విచారణ చేసిన తరువాతనే చంద్రబాబును అరెస్టు చేయటం జరిగిందన్నారు. అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు దోపిడీకి జనసేన పవన్ కళ్యాణ్, సీపీఐ నారాయణ, బీజేపీ పురందేశ్వరి రాజకీయ కక్ష అంటూ ముసుగు వేసి అండగా ఉంటున్నారని ధ్వజమెత్తారు. నీతి నిజాయితీ లేని చంద్రబాబుకు ఏ విధంగా మద్దతు ఇస్తున్నారని జనసేన, సీపీఐ, బీజేపీ నేతలను ప్రశ్నించారు. చంద్రబాబు ఆదేశాల మేరకు నిధులను విడుదల చేయటం, తిరిగి వాటిని చంద్రబాబు వారి మద్దతు దారులకు వచ్చినట్లు ఆధారాలతో నిర్ధారణ అయిందన్నారు. సాక్ష్యాధారాలతో అరెస్ట్ చేసినా బుకాయించటం టీడీపీకే చెల్లిందన్నారు. అడ్డంగా దొరికి పోయిన చంద్రబాబు అరెస్టుకు నిరసనగా నిరాహారదీక్షలు చేస్తామనడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులోనే కాకుండా అమరావతిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్, ఇన్నర్ రింగ్ రోడ్డు స్కామ్ అనేక స్కామ్‌లు చేసిన చంద్రబాబు, బాబు ష్యూరిటీ అని ప్రజల్లోకి వెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబుకే గ్యారంటీ లేదని ఆయన ఏవిధంగా ప్రజలకు ష్యూరిటీ ఇస్తారని ప్రశ్నించారు. కేవలం ఓట్ల కోసమే చంద్రబాబు నాటకాలాడుతున్నారని విమర్శించారు. నిరసనల పేరిట ప్రజాజీవనానికి ఆటంకం కలిగిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో అనేక కుంభ కోణాలు జరిగాయన్నారు. చంద్రబాబుకు మద్దతు ఇస్తే వారు కూడా అవినీతి పరులుగా ముద్రపడతారన్నారు.

పరమేశ్వరుని ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలి



ప్రతిష్ఠించిన స్వామివారి విగ్రహం

మధురానగర్(విజయవాడసెంట్రల్):పరమేశ్వరుని ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. మధురానగర్ శివాలయం సమీపంలో శనివారం పరమశివుని విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన స్వామివారి విగ్రహ ప్రతిష్ఠం చేయటం అభినందనీయం అన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణలో భక్తులకు భోజనాలు వడ్డించారు. తొలుత స్వామివారి విగ్రహంను మధురానగర్ పురవీధులలో ఊరేగించారు. వైఎస్సార్ సీపీ నగర అధికార ప్రతినిధి కంభం కొండలరావు, బోనం నాగు తదితరులు పాల్గొన్నారు.

● వైభవంగా గుణదల శతాబ్ది ఉత్సవాలు









గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర శతాబ్ది ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ ఫాదర్ గాబ్రియేలు, పుణ్యక్షేత్ర రెక్టార్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు తదితర గురువులు ప్రధానాలయం వద్ద లూర్దుమాత శత జయంతి ఉత్సవాల జెండాను ఆవిష్కరించి వేడుకలు ప్రారంభించారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

దాసాంజనేయునికి సింధూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో శనివారం స్వామివారికి విశేషంగా సింధూర పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం చివరి శనివారం కావటంతో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. రెండో శనివారం సెలవుదినం కావటంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

180 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు



విజయవాడ ఇంపాక్ట్ ప్రెసిడెంట్ బి.స్వాతి, జేసీఐ వీక్ కో ఆర్డినేటర్ కె.గణేష్‌బాబు, ప్రోగ్రాం డైరెక్టర్ జె.శివ, ఈవెంట్ స్పాన్సర్లు దీప్తి, రంగా, సంస్థ సభ్యులు ఇర్ఫాన్, సాంబశివరావు, డాక్టర్ ప్రవీణ్ కలపాల, డాక్టర్ భార్గవి, ప్రముఖ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణలంక(విజయవాడతూర్పు):పొట్టి శ్రీ రాములు నగర పాలక సంస్థ పాఠశాల ఆవరణంలో జేసీఐ విజయవాడ ఇంపాక్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ (జేసీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు జరుగుతున్న జేసీఐ వీక్ జైత్రాలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరంలో ముఖ్య అతిథులుగా 20వ డివిజన్ కార్పొరేటర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, 21, 22 డివిజన్ల కార్పొరేటర్లు పుప్పాల కుమారి, తాటిపర్తి కొండారెడ్డి పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరం నిర్వాహకులను అభినందించారు. దంత, కంటి, ఫిజియోథెరపీ,, క్యాన్సర్ స్క్రీనింగ్, షుగర్ వ్యాధి, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. సుమారు 180 మంది రోగులు శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జేసీఐ

దసరా క్యూలైన్ పనులకు నేడు పూజా కార్యక్రమాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరిగే దసరా మహోత్సవాల ఏర్పాట్లు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆదివారం ఉదయం 10-30 గంటలకు కెనాల్‌రోడ్డులోని వినాయకుడి గుడి వద్ద నుంచి క్యూలైన్ పనులను ప్రారంభించనున్నారు. క్యూలైన్ పనులకు ఆలయ చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబలతో పాటు పాలక మండలి సభ్యులు, ఆలయ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది హాజరవుతారు.

తెలుగు భాష విశిష్టతను తెలుసుకోవాలి

గుణదల (విజయవాడ తూర్పు):ప్రతి ఒక్కరూ తెలుగు భాష గొప్పతనాన్ని తెలుసుకోవాలని ఆంధ్ర లయోల కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ కిషోర్ అన్నారు. కళాశాల ఆవరణలో రాజరాజ నరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది మహోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ భాషల్లో తెలుగుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. భారత దేశాన్ని పరిపాలించిన శ్రీకృష్ణ దేవరాయలు సైతం దేశ భాషలందు తెలుగు లెస్స అంటూ కీర్తించారని గుర్తు చేశారు. పాశ్చాత్య పోకడల కారణంగా తెలుగు భాష పై ఆదరణ తగ్గుతోందన్నారు. తెలుగు భాష విశిష్టతను తెలుసుకుని దశ దిశలా వ్యాపింపచేయాల్సిన బాధ్యత నేటి యువతరంపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగాధిపతి కోలా శేఖర్, అధ్యాపకులు శ్రీకుమార్, సహాయభాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

రామ కథాగానం మధురాతి మధురం



సీతాకల్యాణం కథను గానం చేస్తున్న జయరాం సుధాకర్

విజయవాడ కల్చరల్: రామకథాగానం మధురాతి మధురం అని విఖ్యాత హరికథా భాగవతార్ గుడిపాటి జయరాం సుధాకర్ అన్నారు. హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయదాసు 159 జయంతి ఆయన శిష్యప్రశిష్యులు ఐదురోజులపాటు నిర్వహించే హరికథా ఉత్సవాలు సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణ మండపంలో శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు కార్యక్రమంలో సుధాకర్ ఆదిభట్లనారాయణదాసు రచించిన సంపూర్ణ రామాయణంలోని సీతాకల్యాణం ఘటాన్ని మధురంగా వినిపించారు. మూర్తీభవించిన ధర్మానికి ప్రతిరూపం అని రామజననం నుంచి సీతా కల్యాణం వరకు జరిగిన ఘటనలు వివరించారు. నేమాని నాగలక్ష్మి పార్వతీ కల్యాణం, యడవల్లి సుబ్రహ్మణ్యం భక్తప్రహ్లాద, ముదపాక బాలసుందరం నర్తనశాల, పి.వేదవతి శ్రీకృష్ణరాయబారం కథాగానం చేశారు. కార్యక్రమ కన్వీనర్ బుర్రా పద్మనాభశర్మ భాగవతులను సత్కరించారు.

నిరంతర సాధన విజయానికి సోపానం



విజేతలతో నిర్వాహకులు కొల్లా విజయశ్రీ, ఆంజనేయరాజు, వడ్డాది సూర్యకామేశ్వరి తదితరులు

విజయవాడ కల్చరల్: నిరంతర సాధన విజయానికి సోపానమని జయహో వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకురాలు కొల్లా జయశ్రీ అన్నారు. జయహో వాకర్స్ క్లబ్, జయ హో సర్వీస్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో శనివారం తెలుగు సినిమా పాటలపోటీ, విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభను నిర్వహించారు. జయశ్రీ మాట్లాడుతూ గాయనీ గాయకులు శృతి, లయ, రాగ తాళాలపట్ల అవగాహన పెంచుకోవాల్సిన అవసముందని తెలిపారు. సేవా రంగంలో సంస్థ 25 సంవత్సరాలుగా విశేషంగా కృషి చేస్తుందని చెప్పారు. పేద కళాకారులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. సీనియర్ గాయని వడ్డాది సూర్యకామేశ్వరి మాట్లాడుతూ మనసును పరవశించేది పాట అని తెలిపారు. భావం చెడకుండా సాధన చేయాలని సూచించారు. విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి బోడి ఆంజనేయరాజు మాట్లాడుతూ జయహో వాకర్స్ క్లబ్ సేవలను అభినందించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.